

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా చన్నరాయస్వామి రథోత్సవం

మహదేవపుర, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రథసప్తమిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని వర్తూరులో భూనీళా సమేత చన్నరాయస్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మంజుళా, మాజీ మంత్రి అరవింద లింబావళి దంపతులు విశేషపూజల్లో పాల్గొని ఉత్సవమూర్తుల పల్లకీని మోశారు. అనంతరం రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేషపూజా కైంకర్యాలు జరిగాయి. వర్తూరు పురవీధులలో రథోత్సవం సాగింది. తమటె, పూజాకుణిత, నాదస్వర, చింగారిమేళా, చండీ వాద్యం, చట్టిమేళా, వీరగాసె, గారడీబొమ్మలు, డొళ్ళుకుణిత తదితర కళాబృందాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవంలో స్థానిక ప్రముఖులు శ్రీధర్‌రెడ్డి, వర్తూరు శ్రీధర్, మహేంద్రమోది, ఎల్ రాజేశ్, వెంకటేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలైన వైట్‌ఫీల్డ్, బళగెరె, సూరుహుణసె, గుంజూరు, వాలేపుర, మధురనగర సహా చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు వేలాదిమంది పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.



స్వామివారి పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే దంపతులు

విమానాశ్రయ నిర్మాణం కలేనా..?

- 15 ఏళ్ల గడిచినా ముందుకు సాగని పనులు
- మాగాణి భూముల్లో వద్దంటున్న రైతులు



8

ఎయిమ్స్ సాధనకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి


- పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్ కళస
- రాయచూరులో వెయ్యో రోజుకు చేరిన నిరసన



గ్రేటర్ బెంగళూరుకు.. కొత్త రూపం..!



- ఆరు ఉప నగరాలకు కేబినెట్ ఆమోదం
- తొలిదశలో బిడది హోబళిలో ప్రక్రియ



బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో జనసాంద్రతను తగ్గించేలా నగరం చుట్టుపక్కల ఆరు ఉపనగరాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 'గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికార' పరికల్పనలో భాగంగా గ్రేటర్ బెంగళూరు సమగ్ర ఉపనగరాలను అభివృద్ధి చేసేలా కర్ణాటక నగరాభివృద్ధి ప్రాధికార చట్టం 1971 సెక్షన్ 15(1) ప్రకారం సమ్మతించారు. గ్రేటర్ బెంగళూరు సమగ్ర ఉపనగరాల అభివృద్ధి పథకం తొలిదశలో రామనగర జిల్లాలో 'బిడది సమగ్ర ఉపనగర అభివృద్ధి పథకం' అమలు చేసేందుకు ప్రాథమిక ప్రక్రియకు ప్రభుత్వం సాంకేతికంగా అనుమతి ఇచ్చింది. బిడది హోబళిలో 9 గ్రామాలు, హారోహళ్ళి హోబళిలోని ఒక గ్రామంలో బిడది సమగ్ర ఉపనగర అభివృద్ధి పథకంలో భూస్వాధీన ప్రక్రియ చేపట్టేందుకు అంగీకారం తెలిపారు. నగరాభివృద్ధి ప్రాధికార, కర్ణాటక నగరాభివృద్ధి ప్రాధికార నియమావళి 2009 ప్రకారం స్వాధీనం చేసుకున్న భూమికి బదులు 35-50 శాతం మేరకు అభివృద్ధి చేసిన భూమిని పరిహారంగా ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు.

- 8,943 ఎకరాలకుగాను 910 ఎకరాలు కర్ణాటక పరిశ్రమల ప్రదేశాభివృద్ధి మండలి (కేఐఏడీబీ) భూస్వాధీనం చేసుకుంది. దీన్ని మినహాయిస్తే 8,032 ఎకరాలలో బిడది సమగ్ర ఉపనగరం కోసం భూస్వాధీనం చేపట్టాల్సి ఉంటుంది. ఇందులో సెటిల్మెంట్, పాఠశాల-కళాశాల, చెరువు, శ్మశానం, ప్రజలకోసం ఉద్దేశించిన స్థలాలలను యథాతథంగా ఉంచాలని సూచించారు.
- సమగ్ర ఉపనగరాల పథకం అమలుకోసం సక్షమ ప్రాధికార, శాఖ, సంస్థలతో కలిపి సమితిని అదనపు ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గ్లోబల్ టెండర్ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం వర్క్-లివ్-ప్లే విధానంలో రోడ్డు, రైలు అనుసంధానానికి ఉపనగరాలను రూపొందించాల్సి ఉంటుంది. ఇందుకు అర్హులైన సంస్థలను నియమించుకోవచ్చని కేబినెట్ ఆమోదించింది.

ఎక్కడెక్కడ అంటే...


నగరంలోని దేవనహళ్ళి, నెలమంగల, హొసకోటె, దొడ్డబళ్ళాపుర, మాగడి, బిడది ప్రాంతాలలో ఉపనగరాలు ఏర్పాటు చేయదలిచారు. సుస్థిర మౌలిక సదుపాయాలతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేసి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఉంది. బిడది హోబళి పరిధిలోని బైరమంగల, బన్నిగెరె, హోసూరు, కెజి గొల్లరపాళ్య, కంచుగారనహళ్ళి, అరళాళుసంద్ర, కెంపయ్యనపాళ్య, కంచుగారనహళ్ళి కావలు, మండలహళ్ళి గ్రామాలు ఉన్నాయి. ఇక హారోహళ్ళి హోబళిలోని వడేరహళ్ళితో మొత్తం 10 గ్రామాలు బిడది ఉపనగర పరిధిలోకి రానున్నాయి. ఇందులో 6,023 ఎకరాలు గ్రామాలలోని సాగు ప్రదేశం, 2,818 ఎకరాలు బి ఖరాబు, 101 ఎకరాలు ఖరాబు భూమి ఉంది.

దేవనహళ్లి తాలూకాలో అభ్యంతరాలు

కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలెప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) ఇప్పటికే దేవనహళ్ళి, ఆనేకల్ తాలూకాలలో పలు అభివృద్ధి పథకాలకు రైతుల నుంచి సాగుభూములు స్వాధీనం చేసుకుంటుండగా పలు రైతుసంఘాలనుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. విడతలవారీగా ఇందుకు సంబంధించి నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. అభివృద్ధికి తమకు అభ్యంతరం లేదని అయితే సాగుభూములు ఇచ్చేది లేదని వందలాది రైతులు నిరసన తెలిపారు. ఖాళీగా ఉన్న బంజరు భూములను వినియోగించుకోవాలని, సారవంతమైన భూములను లాక్కోవద్దని కోరుతున్నారు. ఇలా దేవనహళ్ళి ఆనేకల్ తాలూకాల్లో ఇందుకు సంబంధించి పలుమార్లు నిరసన ర్యాలీలు, సభలు నిర్వహించి తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనేకల్ తాలూకాలో సూర్యసిటీ ప్రాంతంలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగలేదు. ఖాళీగా ఉన్న ప్రదేశాలను సద్వినియోగం చేసుకోవాలని రైతుసంఘాలు కోరుతుండగా, మరోవైపు స్విఫ్ట్ (స్టార్టప్స్, వర్క్‌స్పేసెస్, ఇన్నోవేషన్, ఫైనాన్స్ అండ్ టెక్నాలజీ) సిటీ కోసం సర్జాపుర ప్రాంతంలో వెయ్యి ఎకరాలలో అభివృద్ధి భూస్వాధీనం కోసం రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పాత అభివృద్ధి పథకాలకు సంబంధించిన భూ స్వాధీన ప్రక్రియ వివాదం ఇంకా సమసిపోకముందే స్విఫ్ట్‌సిటీని తెరపైకి తెచ్చారు. దీంతో ఆనేకల్ తాలూకా ప్రాంత రైతుల నుంచి పలుమార్లు నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇక దేవనహళ్ళి తాలూకాలో గత నెలలో జరిగిన రైతుల నిరసనకు మద్దతుగా విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ కూడా పాల్గొన్నారు. ఈఅంశం ఇంకా పూర్తికాకనే తాజాగా గ్రేటర్ బెంగళూరు పథకంలో భాగంగా దేవనహళ్ళి తాలూకాను ప్రతిపాదించారు. రైతులు, ప్రజల నుంచి అభ్యంతరాల నడుమ ఇది ఎంతవరకు ఫలిస్తుందనేది వేచిచూడాలి,

లోపాల యూజీసీ పాలసీలను వెనక్కి తీసుకోవాలి

- డీసీఎం డీకే శివకుమార్



సమ్మేళనంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల మంత్రులతో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లోపాలతో కూడిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పాలసీలను కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రుల సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలు చేసిన జాతీయ విద్యావిధానం (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ)లో పలు లోపాలు ఉన్నాయన్నారు. కర్ణాటక ప్రభుత్వం ధైర్యంగా వాటిని సవరించేలా తీర్మానం తీసుకుందన్నారు. సమ్మేళనంలో తీసుకున్న పలు అంశాలను కేంద్రప్రభుత్వానికి చేరాలన్నారు. కర్ణాటక సహా దక్షిణభారత్‌లోని అన్ని రాష్ట్రాలలో విద్యా ప్రమాణం అత్యుత్తమంగా ఉందన్నారు. తాము కూడా సౌలభ్యాలు అందిస్తున్నామన్నారు. 30ఏళ్లక్రితమే ఉత్తరభారత్ విద్యార్థులు దక్షిణ భారత రాష్ట్రాలకు ఉన్నత విద్యకు వచ్చేవారన్నారు. రాష్ట్రంలో 70కుపైగా మెడికల్ కళాశాలలు, 250కుపైగా ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయని, తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా అత్యధిక కళాశాలలు ఉన్నాయన్నారు. అయితే మన జాతీయ విద్యావిధానం అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లడం సాధ్యమేనా అనేది పెద్ద ప్రశ్నార్థకంగా ఉందన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలి

మన ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం ద్వారా పలు హక్కులు ఉన్నాయని భాషా అంశాలలో మనం వైవిధ్యాన్ని కలిగి ఉన్నామన్నారు. రాష్ట్రస్థాయిలో కాకుండా ప్రపంచస్థాయిలో పోటీ పడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా వ్యవస్థలో పలు మార్పులు అవసరమన్నారు. 30ఏళ్లలో ఎన్నో మార్పులు చూశామని, తాజాగా ఏఐ సాంకేతికత అందుబాటులోకి వచ్చిందన్నారు. దీంతో యువత మరిన్ని అవకాశాలు సృష్టించుకోవాలన్నారు.

వర్సిటీల్లో సంస్కరణలు అవసరం

యూనివర్సిటీలలో పాలనాపరంగా పలు సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు. దీనిపై సమగ్రంగా చర్చించాల్సి ఉందన్నారు. కులపతుల నియామకం సహా పలు అంశాలు తమ ముందు ఉన్నాయన్నారు. కులపతి, విద్యా సిబ్బంది నియామకాలలో కనీస ప్రమాణాలను, అర్హతలను నిర్ణయించాల్సి ఉందన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఉన్నత విద్యావ్యవస్థ బలోపేతం కావాలన్నారు. పలు దేశాల విశ్వవిద్యాలయాలలో భారతీయులు అత్యుత్తమ స్థానాలను అలంకరించారని, ఈ సమ్మేళనం ద్వారా గ్లోబల్‌స్థాయి విద్యావ్యవస్థ చేరేలా అనేకమంది నిపుణుల సలహాలు దోహదపడతాయనే విశ్వాసం వ్యక్తం చేశారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో ఐటీ నిపుణులను తయారు చేయడంలో ముందజంలో ఉన్నారని, మన దక్షిణభారత్ రాష్ట్రాలతో సరిసమానంగా ఎవరూ నిలవలేరన్నారు. మన రాష్ట్రాలు తమదైన శక్తిని కల్గి ఉన్నాయన్నారు. పని చేయడానికి నేర్చుకోవడానికి శ్రమించడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. పూర్వీకులైన నాయకులు విద్యారంగానికి బలమైన పునాదులు వేశారని వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన దేశ విద్యావ్యవస్థలో ఇదే గొప్ప సాధన అన్నారు. కాగా సమావేశంలో పాల్గొన్న హోం మంత్రి పరమేశ్వర్‌కు, తనకు విద్యాసంస్థలు ఉన్నాయని ఈ రంగంలో తమకు అనుభవం ఉందన్నారు. వీటిపై సాధకబాధకాల అవగాహన ఉందన్నారు. మహారాష్ట్ర ఉన్నత విద్యారంగం అంశంలో కర్ణాటక, తెలంగాణలతో పోలిస్తే తనదైన ప్రత్యేకత కలిగి ఉందన్నారు. అనేక రాష్ట్రాలలో కేంద్రంలో, రాష్ట్రాలలో వేరే పార్టీలు అధికారంలో ఉండడంతో కులపతి, ఉపకులపతుల అంశంతో తీర్మానం తీసుకోవడం కష్టంగా ఉందని అయినా కూడా తాము నిభాయిస్తున్నామన్నారు. మనం అందరం చేరి అత్యుత్తమమైన ఉన్నతవిద్యను కాపాడుకోవాలని, యువతకు ఉత్తమ భవిష్యత్తు ఇవ్వాలని వివిధ రాష్ట్రాల ఉన్నత విద్యాశాఖ మంత్రులు, విద్యానిపుణులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌ను అభినందించారు. సమావేశంలో హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన మంత్రులు పాల్గొన్నారు.



మైక్రో ఆగడాల అడ్డుకట్టకు.. ప్రణాళికలు..!

- వేధింపులు తప్పించేందుకు నియమాలు పాటించాలని సూచన
- హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసేందుకు అవకాశం

బెంగళూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి ప్రజలు తమ అవసరాలకోసం మైక్రోఫైనాన్స్ సంస్థలనుంచి రుణాలు తీసుకుంటుంటారు. తిరిగి చెల్లించడంలో జాప్యమైతే సదరు సంస్థల ప్రతినిధులు, ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల వేధింపులు తీవ్రమవుతున్న తరుణంలో ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. వీటికి అడ్డుకట్ట వేసేలా పలు చర్యలు చేపట్టాలని సంబంధితశాఖ అధికారులకు సూచించింది.

సీఎం అధ్యక్షతన సమావేశం

జనవరి 25న ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన మైక్రో ఫైనాన్స్ సంస్థల కర్ణాటక ప్రాంతీయ అధ్యక్షులు, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్, సాధన్, ఏకేఎంఐ, మైక్రో ఫైనాన్స్ డైరెక్టర్స్ నెట్‌వర్క్ (ఎంఎఫ్ఐఎన్), ప్రముఖ మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సంచాలకులు, అధికారులు, పోలీసులు, రెవెన్యూ, సహకార, ఆర్థిక శాఖ అధికారులతో సమావేశం జరిగింది. వేధింపుల నియంత్రణకు చేపట్టాల్సిన అంశాలపై మార్గదర్శకాలు చేశారు.

- కర్ణాటక మనీలెండర్స్ యాక్ట్ 1961 ప్రకారం నియమాలు కట్టుదిట్టంగా అమలు చేసేలా దిశానిర్దేశం చేశారు. 2024 డిసెంబరు 31వరకు 20,245 సంస్థలు నమోదు చేసుకున్నాయి. వాటిలో 6,590 లెండర్స్‌గాను, 6,772 పాన్ బ్రోకర్‌లు, 7,063 ఫైనాన్స్ కార్పొరేషన్‌లు ఉన్నాయి. ఇష్టం వచ్చినట్టు వడ్డీ వసూలు చేసేందుకు అవకాశం లేదన్నారు. హామీ ఉన్న రుణాలకు ఏడాదికి గరిష్ఠంగా 14 శాతం, సెక్యూరిటీ లేని రుణాలకు 16 శాతంగా మనీలెండర్స్‌గా నిర్దేశించారు. వీటికి సంబంధించి ప్రజలకు సదరు సంస్థలు తమ కార్యాలయాల నోటీసు బోర్డుల ద్వారా తెలియచేయాల్సి ఉంటుంది.

మైక్రో ఫైనాన్స్ సంస్థలంటే..?

రూ.3లక్షల వరకు ఆదాయం కల్గిన ప్రజలకు రుణాలు కల్పించే వ్యవస్థను మైక్రో ఫైనాన్స్‌గా వ్యవహరిస్తారు. బ్యాంకులు కాకుండా సహకార సంఘాలు, ఎన్‌బీఎఫ్‌సీలు, ప్రభుత్వేతర సంస్థలు, ట్రస్టులు, చిన్న దుకాణాల యజమానుల తదితరులు రుణాలు ఇస్తారు. సహకార సంస్థలకు సంబంధించి సహకారశాఖ, బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ)కి సంబంధించి ఆర్‌బీఐ ద్వారా నమోదు, విచారణ చేపడతాయి. సాధన్, మైక్రోఫైనాన్స్ సంస్థలను ఆర్‌బీఐ స్వయం నియంత్రణా సంస్థలుగా ఏర్పాటు చేసింది. నిర్ణీత ఉత్తమ లావాదేవీలు చేసేందుకు ఈ సంస్థలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో కేవలం 31 మైక్రో ఫైనాన్స్ సంస్థలు అస్తిత్వంలో ఉన్నాయి. ఇవి అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక మైక్రోఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్ (ఏకేఎంఐ) సభ్యత్వం పొందాయి. రాష్ట్రవ్యాప్తంగా 3,090 శాఖలు ఉన్నాయి. 37,967 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 1,09,88,332 ఖాతాల ద్వారా 59,367.76 కోట్ల బకాయి ఉంది. నియమాలు పాటించని ఆర్థిక సంస్థలపై ఉన్నత సంస్థలు ఆర్‌బీఐకి నివేదిక ఇవ్వనున్నాయి. ఆర్‌బీఐ సూచనతో తగిన చర్యలు తీసుకుంటాయి.

రుణాల వసూళ్లకు ఆర్‌బీఐ మార్గదర్శకాలు

అన్ని ఎన్‌బీఎఫ్‌సీ, ఎంఎఫ్ఐ సంస్థలు వడ్డీ ధర, రుణాలు చెల్లించాల్సిన కంతులు, అసలు, వడ్డీ వంటి విషయాలకు సంబంధించి ఫ్యాక్ట్ షీట్ ద్వారా రుణం మంజూరువేళ ప్రతి రుణగ్రహీతకు వివరించాల్సి ఉంటుంది. మైక్రోఫైనాన్స్ సంస్థలు అనుసరించాల్సిన పద్ధతులు ఏమంటే రుణం మంజూరు వేళ సంబంధిత వ్యక్తి లేదా సంస్థలకు వారికి అర్థమయ్యే భాషలో వివరించాల్సి ఉంటుంది. రుణం అర్జీ షరతుల గురించి సమాచారం ఇవ్వాలి. నగదు పుస్తకం, లెడ్జర్, ఇతర దాఖలాలను సమగ్రంగా నిర్వహించాలి. రుణం మంజూరు చేసిన ఏడు రోజుల్లోగా నిర్ణీత నమూనాలో రుణం మొత్తం, మంజూరు తేదీ, గడువు తేదీ, సంస్థ నిర్వాహకుల పేరు, చిరునామా, నియమానుసారం విధించిన వడ్డీ వివరాలను స్పష్టంగా లిఖిత పూర్వకంగా తెలియచేయాల్సి ఉంటుంది. రుణగ్రహీత చెల్లించేవాటికి సంతకంతో కూడిన రసీదు ఇవ్వాలి.

స్వయం సహాయక సంఘాల రుణాలు

మహిళా స్వయం సహాయక సంఘాలు చాలా వరకు కన్సంప్షన్‌లోన్ సదుపాయం కలిగి ఉంటాయి. వీటిలో 99 శాతం విజయవంతంగా తిరిగి చెల్లింపులు అవుతాయి. బ్యాంకులలో వీటికి సులభమైన రీతిలో రుణాలు ఉండడంతో ప్రజలు ఎక్కువగా వీటిపట్ల ఆసక్తి చూపుతారు.

హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయవచ్చు

పేద, మధ్యతరగతి వర్గాలు విద్య, పెళ్లి, ఇతరత్రా అవసరాలకు రుణాలు చేస్తుంటారు. కంతులను చెల్లించడంలో ఒక్కోసారి జాప్యం అవుతుంటాయి ఇదే అదునుగా ఫైనాన్స్ సంస్థల రికవరీ ఏజెంట్లు వేధింపులకు గురి చేస్తుంటారు. ఇటువంటి తరుణంలో ఆర్‌బీఐ హెల్ప్‌లైన్ 14448కు లేదా ఎంఎఫ్ఐ, మనీలెండింగ్ సంస్థల హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయవచ్చని ప్ర భుత్వ ముఖ్యకార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ అన్నారు. రాష్ట్రప్రభుత్వం మైక్రోఫైనాన్స్ రుణగ్రహీతలకు అన్ని విధాలా రక్షణ కల్పించేలా ఏకీకృత హెల్ప్‌లైన్ 112 లేదా 1902కు సంప్రదించాలని సూచించారు.

బళ్లారి జిల్లా పంచాయతీకి నరేగా అవార్డు

- నాలుగు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ నరేగా పథకాన్ని 2002-24లో సమర్థవంతంగా అమలు చేసినందుకు బళ్లారి జిల్లా పంచాయతీకి నరేగా అవార్డుతో సహా మొత్తం నాలుగు విభాగాల్లో అవార్డు లభించాయి. ఉత్తమ జిల్లా అవార్డు బళ్లారి పంచాయతీకి, ఇంటిగ్రేటెడ్ అవార్డు అటవీశాఖకు, తాలూకా పంచాయతీ అవార్డు సండూరుకు, ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు దమూరు పంచాయతీకి దక్కాయి. బెంగళూరులోని వసంత్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన నరేగా-2025 కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, బయోటెక్నాలజీ మంత్రి ప్రియాంక ఖర్గే ఈ అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప అవార్డులను అందకున్నారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి కమిషనర్ పవన్‌కుమార్ మాలపాటి, జడ్పీ డిప్యూటీ సెక్రటరీ గిరిజా శంకర్ పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న సందర్భంగా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సంబంధిత అధికారులను అభినందించారు.



అవార్డు అందుకుంటున్న బళ్లారి జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప



వారధిగా ఉంటూ సాయం చేయాలి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్
పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికార సంస్థ, న్యాయ సహాయం కోసం వచ్చే బాధితుల మధ్య వారధిగా ఉంటూ సహాయాన్ని అందించేవారే పారా లీగల్ వలంటీర్లు అని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బార్ అసోసియేషన్ హాలులో పారా లీగల్ వలంటీర్లకు మొదటి రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల గురించి వివరించారు. బాధితులకు న్యాయ సహాయం అందించే సమయంలో తమ పాత్ర ఎలా నిర్వర్తించాలో వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పద్మజ, నామాల హరికృష్ణ, ఐటికె నల్లప్ప పాల్గొన్నారు.

గిరిజనుల చైతన్యమే ధ్యేయం

జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రామాంజనేయులు

ఇంటర్వ్యూ interview


రామాంజనేయులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులను చైతన్యం చేయడమే ధ్యేయంగా పని చేస్తానని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, వాటి లబ్ధిని పొందేలా చర్యలు తీసుకుంటానన్నారు. సబ్సిడీ రుణాలు రాగానే, అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రశ్న : ధర్తీ ఆబా జన్ జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పనులు ఎలా జరుగుతున్నాయి..?

జవాబు: జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ పథకం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎలక్ట్రిసిటీ పనులు పూర్తయ్యాయి. జల్‌జీవన్ మిషన్, అగ్రికల్చర్, స్కిల్ డెవలప్‌మెంట్ పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

ప్ర : వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారా..?

జ: వసతిగృహాల్లో ఇప్పటికే చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని బెడ్‌షీట్లు, దుప్పట్లు తెప్పించాం. మెష్‌లను ఏర్పాటు చేశాం. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా చూస్తున్నాం. డైట్ బిల్లులు సక్రమంగా జమయ్యాయి.

ప్ర: పదో తరగతి విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు..?

జ: పదో తరగతి విద్యార్థులకు సంబంధించి ప్రతి వసతిగృహంలో స్టడీ అవర్స్‌ను ఏర్పాటు చేశాం. వారంలో ఒక రోజు ప్రత్యేక ట్రైనర్లతో సబ్జెక్టులను బోధిస్తున్నాం. ఎవరైనా విద్యార్థులు సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉంటే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నాం. ఈ ఏడాది ప్రతి విద్యార్థి పాసయ్యేలా సన్నద్ధం చేస్తున్నాం.

ప్ర: గురుకుల పాఠశాలల్లో ఫ్యాకల్టీ కొరతను ఎలా అధిగమిస్తారు?

జ: గురుకుల పాఠశాలల్లో ఇదివరకూ ఫ్యాకల్టీ కొరత ఉన్న మాట వాస్తవమే. అయితే పైస్థాయి అధికారుల అనుమతితో ప్రైవేట్ టీచర్లను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నాం.

ప్ర: గిరిజనులకు ఏ ఏ పథకాలు వర్తింపజేస్తున్నారు?

జ: ఇప్పటి వరకూ గిరిజనులకు సంబంధించిన అన్ని పథకాలు వర్తింపజేశాం. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మరిన్ని పథకాలు వర్తింపజేయనుంది. ప్రస్తుతం 0-200 యూనిట్ల వరకూ కరెంటు బిల్లులు లేని పథకం అమలు అవుతోంది.

ప్ర: గిరిజనుల స్వయం ఉపాధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జ: గ్రామాల్లో చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు ఉన్నారు. వారిలో యువతకు వారి చదువును బట్టి స్కిల్ డెవలప్‌మెంట్ కింద శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నేడు సమగ్రశిక్ష ఏఎస్పీడీ రాక

అనంతపురం విద్య, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్(ఏఎస్పీడీ) గురువారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఏఎస్పీడీ రవీంద్రనాథ్ జిల్లా పర్యటనలో భాగంగా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఉద్యోగులతో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తారు. తర్వాత జిల్లాలో కేజీబీవీ స్కూళ్లు, భవిత కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. స్కూళ్లలో మధ్యాహ్న భోజనం, అటెండెన్స్ తదితర అంశాలను పరిశీలించనున్నట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది.


రబీలోనూ నష్టాలే..!

- పాతాళానికి ధరలు
- అమాంతం రూ.3 వేలు తగ్గిన వైనం
- అన్నదాత అప్పులపాలు

• వేరుశనగను దెబ్బతీసిన మచ్చ తెగులు • దారుణంగా తగ్గిపోయిన దిగుబడి • ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లే..

వేరుశనగ రైతుకు మళ్లీ నష్టాలే. ఖరీఫ్‌లో అననుకూల వర్షాలతో పంట చేతికి రాలేదు. దీంతో చాలాచోట్ల రైతులు పంటను తొలగించుకున్నారు. రబీలోనూ నష్టాలు తప్పలేదు. వర్షాలు, మంచు ప్రభావంతో తేమ పెరిగి, మచ్చ తెగులు విపరీతంగా సోకాయి. దీంతో దిగుబడి దారుణంగా పడిపోయింది. సాధారణంగా 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి ఈసారి 2 నుంచి 3 క్వింటాళ్లకే పరిమితమైంది. ధర కూడా అమాంతం పడిపోయింది. నెల క్రితం వరకు రూ.8 వేలు పలికిన క్వింటాల్ వేరుశనగ ధర.. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. తెగుళ్ల ప్రభావంతో వేరుశనగ కట్టె కూడా నల్లగా మారిపోయింది. దీంతో గ్రాసానికి కూడా పనికిరాదని రైతులు వాపోతున్నారు. -ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం

పెట్టుబడి కూడా వస్తుందో.. రాదో..



మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. రూ.1.50 లక్ష వరకు పెట్టుబడి పెట్టా. తెగుళ్లు సోకి వేరుశనగ కట్టె నల్లగా మారిపోయింది. దిగుబడి తగ్గడమే కాకుండా, ధర కూడా అమాంతం పడిపోయింది. దీంతో పెట్టుబడి కూడా వస్తుందో.. రాదోనని.. ఆందోళన చెందుతున్నాం.
- జయన్న, రైతు, ఒంటారెడ్డిపల్లి


నల్లగా మారిన వేరుశనగ కట్టె

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్, బెళుగుప్ప మండలాల పరిధిలో 6 వేల హెక్టార్లకు పైబడి ఈసారి రబీలో విత్తన వేరుశనగ సాగు చేశారు. సెప్టెంబరులో పంట పెట్టారు. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి కింద వెచ్చించారు. రెండు నెలల వరకు పంట బాగానే ఉంది. ఆ తరువాత పంట ఎదుగుదల లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. వర్షాలు, అధిక మంచు కారణంగా పంటకు మచ్చ తెగులు సోకాయి. దీంతో దిగుబడి తగ్గిపోయింది. వేరుశగన కట్టె నల్లగా మారిపోయి, కాయలన్నీ భూమిలోపలికి కుచించుకుపోయాయి. ఎన్నిసార్లు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుకు 5 నుంచి 10 కాయలు మాత్రమే దిగుబడి వచ్చింది. కొన్ని చెట్లలో కాయలే కనిపించని దుస్థితి. సాధారణంగా ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈసారి తెగుళ్ల ప్రభావంతో 2 నుంచి మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి దక్కవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

అమాంతం పడిపోయిన ధర

విత్తన వేరుశనగ క్వింటాల్ ధర నెలరోజుల క్రితం రూ.8 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.5వేలు పలుకుతోంది. అమాంతం రూ.3 వేలు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడిలేని సమయంలో ధర కూడా పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కర్ణాటకలోని చెళ్లికెరకు తీసుకెళ్లి విత్తన వేరుశనగను అమ్ముతున్నారు. అక్కడ కూడా ధర దక్కక రైతు డీలా పడిపోయాడు. ప్రస్తుత ధరల ప్రకారం ఎకరాలో దిగుబడి విక్రయిస్తే రూ.15 వేలు కూడా రావట్లేదు. పెట్టుబడి మాత్రం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టారు. దీంతో భారీగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.




పొలంలోనే నల్లగా మారిన వేరుశనగ కట్టె

చెట్టుకు 5 నుంచి 8 కాయలే..



రబీలో నాకున్న మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. రెండు నెలలపాటు పంట ఎదుగుదల బాగానే ఉంది. ఆ తరువాత తెగుళ్లు సోకాయి. వేరుశనగ చెట్టంతా నల్లగా మారిపోయి, పూర్తిగా దిగుబడి పడిపోయింది. కోత కోయడంతో చెట్టుకు 5 నుంచి 8 కాయలు మాత్రమే ఉన్నాయి. దీంతో పెట్టుబడి కూడా వస్తుందో.. రాదో.. తెలియదు. వేరుశనట కట్టె కూడా నల్లగా మారిపోవడంతో పశువులకు మేతగా పనికిరాదు.
- హనుమంతరాయుడు, రైతు, జెల్లిపల్లి

తేమశాతం ఎక్కువ కావడంతోనే ...


రబీలో సాగు చేసిన వేరుశనగ పంటకు ఎక్కువగా మచ్చతెగులు సోకడానికి ప్రధాన కారణం తేమశాతం ఎక్కువ కావడమే. సరైన సమయంలో తగిన మోతాదులోనే వేరుశనగకు నీరు వదలాలి. ఇష్టారాజ్యంగా ఇస్తే తెగులు ఉధృతంగా వ్యాపిస్తాయి. కాండం, మొదలు ఎండుకుపోయి, ఆకు రాలిపోతుంది. తద్వారా వేరుశనగ దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశాలుంటాయి.
- యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

నేటి నుంచి జకినీ మాత ఉత్సవాలు


సునామ జకినీమాత


మల్యామ జకినీ మాత

గుత్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అరెకటికల ఆరాధ్య దేవతలైన సునామ జకినీమాత, మల్యామ మాత జాతర ఉత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నారు. గుత్తి ఆర్ఎస్ రోడ్డులో వెలసిన సునామ జకినీ మాత ఆలయంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు, ధర్మకర్త సురేష్‌రావు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు ఉత్సవాలకు హాజరవుతారన్నారు. వచ్చే భక్తులకు తాగునీరు, భోజన సౌకర్యం కల్పించను న్నట్లు వారు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం తెల్లవారుజామున అమ్మవార్లకు అభిషేకం, హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను స్థానిక సాయిబాబా దేవాలయం నుంచి అమ్మవారి దేవాలయం వరకు కన్యలు, ముత్తైదువులు పూర్ణకుంబాలతో ఊరేగింపు, పూర్ణ కళశాలతో అభిషేకం కార్యక్రమాలు చేస్తామన్నారు. భక్తులచే అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, రాత్రి చిన్నారులచే నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవార్లకు పంచామృతం, సుగంధ ద్రవ్య పసుపు కుంకుమలతో ప్రత్యేక అభిషేకం, భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ఉదయం 7గంటలకు అమ్మవార్లకు గంగాస్నానం, గుత్తి ఆర్ఎస్ రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి కన్యలచే పూర్ణకుంభాలతో అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపు, అనంతరం అమ్మవార్లకు పాలాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారి లడ్డూ వేలం నిర్వహిస్తామన్నారు. వివిధ రాష్ట్రాల అరెకటిక కుల సంఘాలు, ప్రజాప్రతినిధులతో సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు లక్ష దీపారాధన నిర్వహిస్తామని వారు తెలిపారు.


భోజన సౌకర్యాలను పరిశీలిస్తున్న కమిటీ నిర్వాహకులు

ఫార్మసీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఓటీపీఆర్ఐలో బీఫార్మసీ, ఫార్మా-డి కోర్సులకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈఏపీసెట్ ద్వారా కన్వీనర్ కోటాలో ఇప్పటికే ప్రవేశాలు జరిగాయన్నారు. మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై, ఈఏపీసెట్ బైపీసీ స్ట్రీమింగ్‌లో అర్హత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ పొంది ఉండకూడదన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారు ఫీజు రీయింబర్స్‌కు అనర్హులని పేర్కొన్నారు. ఈనెల 6,7 తేదీల్లో జేఎన్టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్స్‌కు ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కోవాలని తెలిపారు. వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కోత

ఇక సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి..



గుంతకల్లు రైల్వే స్టేషన్

గుంతకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో గుంతకల్లు రైల్వే డివిజన్ కొంతమేర కోతకు గురైంది. ఈ డివిజన్‌లోని రాయచూరు-నాల్వార్ రైల్వే సెక్షన్‌ను సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోకి (సౌత్ సెంట్రల్) మారుస్తూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులను జారీచేసింది. రాయచూరు-నాల్వార్ సెక్షన్‌కు గుంతకల్లు డివిజన్‌లో 107.58 కి.మీ. లైన్, 12 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి గుంతకల్లు రైల్వే డివిజన్ మారనున్న నేపథ్యంలో పరిపాలన, నిర్వహణ సౌలభ్యం కోసం రాయచూరు-నాల్వార్ మార్గాన్ని ఎస్‌సీ రైల్వేలోకి మార్చాలని నిర్ణయించారు. గతంలో గుంటూరు రైల్వే డివిజన్, హుబ్లీ డివిజన్ల ఏర్పాటు సందర్భంగా కూడా గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కోత వేశారు. పలు రైల్వే సెక్షన్లను ఆ డివిజన్లలోకి మార్చారు. గుంతకల్లు రైల్వే డివిజన్ సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉన్నప్పుడు సికింద్రాబాద్, విజయవాడ తర్వాత పెద్ద విస్తీర్ణం కలిగిన మూడో డివిజన్‌గా ఉండేది. ప్రస్తుతం సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి మారినందున విజయవాడ తర్వాత రెండో పెద్ద డివిజన్‌గా మారింది. రాయచూరు-వాడి రైల్వే సెక్షన్‌లో రెండు పవర్ జనరేషన్ ప్లాంట్లు ఉన్నందున బొగ్గు రవాణాకు ఈ సెక్షన్ మూడు రైల్వే జోన్‌లకు అత్యంత కీలకంగా మారనుంది. ఈ కారణంగా మధ్య రైల్వే, దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ కోస్తా రైల్వే జోన్లలో వాడి జంక్షన్ అత్యంత కీలకం కానుంది. పరిపాలన, నిర్వహణ సౌలభ్యం కోసం వాడి జంక్షన్‌ను క్రూ చేంజింగ్ పాయింట్‌గా రైల్వేశాఖ గుర్తించింది.

లాభాలూ ఉన్నాయ్..

జోన్ మార్పు కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్ కుదింపునకు గురైంది. ఆదాయ పరంగా నష్టం, జోనల్ కేంద్రం దూరంగా ఉండటం ఇబ్బందికరమే అయినా, కొన్ని ఉపయోగాలు ఉన్నాయి. సౌత్ కోస్టు రైల్వే జోన్ ఏర్పాటు వల్ల విశాఖపట్టణం-విజయవాడ-గుంతకల్లు రైల్వే డివిజన్ల మధ్య కనెక్టివిటీ, ట్రాఫిక్ పెరుగుతుంది. దీని వల్ల రాష్ట్ర రాజధానికి రైళ్లు లేక ఇబ్బందిపడుతున్న గుంతకల్లు రైల్వే డివిజన్ ప్రయాణికులకు, ముఖ్యంగా రాయలసీమ ప్రజలకు మేలు జరగనుంది. రాష్ట్ర రాజధానికి వెళ్లేందుకు అమరావతి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మినహా డెయిలీ ఎక్స్‌ప్రెస్‌లు లేక ఇబ్బందులు పడుతున్న సీమ ప్రజలకు కష్టాలు తీరే అవకాశాలు ఉన్నాయి. గతంలో రద్దయిన యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరుతోపాటు, మరిన్ని రైళ్లు వచ్చే పరిస్థితులు ఏర్పడుతాయి.

936 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 600 బుధవారం టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21,120 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4,200, సరాసరి రూ.11వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ మేళాకు గుంతకల్లు డివిజన్ మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న తిరుపతి-దానాపూర్ ప్రత్యేక రైలు (నం. 07117) రాత్రి 11-45 గంటలకు తిరుపతిలో బయలుదేరి రెండు రోజుల తర్వాత 16వ తేదీ రాత్రి 11-55 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07118) ఈ నెల 17న దానాపూర్‌లో మధ్యాహ్నం 3-15 గంటలకు బయలుదేరి 19వ తేదీ మధ్యాహ్నం 1-55 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని వివరించారు. ఈ రైలు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ, మల్కాజ్‌గిరి, చర్లపల్లి, ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, ఇటార్సి, పిప్రియా, జబల్పూర్, కట్నీ, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, అర స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే తిరుపతి-దానాపూర్ ప్రత్యేక రైలు (నం. 07119) ఈ నెల 18వ తేదీ రాత్రి 11-45 గంటలకు తిరుపతిలో బయలుదేరి 20వ తేదీ రాత్రి 11-55 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07120) ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3-15 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి 23వ తేదీ మధ్యాహ్నం 1-45 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. ఈ రైలు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, సూళేహళ్లి, సేడం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, చర్లపల్లి, ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, ఇటార్సి, పిప్రియా, జబల్పూర్, కట్నీ, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, అర స్టేషన్ల మీదుగా వెళుతుందని వెల్లడించారు.

చేనేతకు పూర్వ వైభవం

- లోకేశ్ చొరవతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు
- మంత్రి సవిత



దుస్తులు కుడుతున్న మంత్రి సవిత

హిందూపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వీర్యమైన చేనేత రంగానికి పూర్వవైభవం తెస్తానని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం హిందూపురం పట్టణ పరిధిలోని తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో హిందూపురం నియోజకవర్గంలో 3వేల కుటుంబాలకు ఉచిత జాకార్డ్‌లు మంజూరు చేశామని తెలిపారు. వైసీపీ హయాంలో చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర లేక చాలా మంది వృత్తికి దూరమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం చేనేతలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో చేనేతలు అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. దీంతో వారి సమస్యలు దగ్గరగా చూశాక ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. 1989లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు హిందూపురంలో తెలుగు చేనేత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారని వివరించారు. శిక్షణ పొందిన 65 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా మిషన్ కుట్టారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ ఏడీ హరిక్రిష్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, టీడీపీ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

గోముల్కా (జయంతి)



పోలిష్ కమ్యూనిస్టు రాజకీయ నేతగా పేరొందిన గోముల్కా 1905 ఫిబ్రవరి 6న ఆస్ట్రియా-హంగేరి దేశం (ప్రస్తుతం పోలెండ్)లో జన్మించారు. పోలిష్ యునైటెడ్ వర్కర్స్ పార్టీకి తొలి కార్యదర్శి దశాబ్దాలపాటు ఆయన అనధికారికంగా శాసించారు. సోషలిజంవైపు సాగిన ఆశయాలు 'గోముల్కా థా'గా పేరొందాయి. 1982 సెప్టెంబరు 1న కన్నుమూశారు.

రోనాల్డ్ రీగన్ (జయంతి)



అమెరికా దేశ 40వ అధ్యక్షుడిగా వ్యవహరించిన రోనాల్డ్ విల్సన్ రీగన్ 1911 ఫిబ్రవరి 6న జన్మించారు. 1981 నుంచి 1989వరకు రెండు సార్లు రిపబ్లికన్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. సోవియట్ యూనియన్‌లోని అమెరికా, రష్యాల మధ్య దశాబ్దాలపాటు సాగిన శీతలసమరాన్ని పరిష్కరించి ప్రజల ఆదరణ పొందారు. అధ్యక్షుడు కాక మునుపు కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్‌గా, రేడియో, దూరదర్శన్, సినిమా నటుడిగా పనిచేశారు. 2004 జూన్ 5న కన్నుమూశారు.

శ్యామశాస్త్రి (వర్ధంతి)



కర్ణాటక సంగీత త్రిమూర్తులలో మూడోవారైన శ్యామశాస్త్రి 1763 ఏప్రిల్ 26న తంజావూరు జిల్లా తిరువారూరు గ్రామంలో జన్మించారు. అసలు పేరు 'వేంకట సుబ్రహ్మణ్యం'. వాగ్గేయకారులైన త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి సంగీత త్రిమూర్తులుగా పేరొందారు. శ్యామశాస్త్రి స్వయంగా కామాక్షిదేవి ఉపాసకులు. తెలుగు, సంస్కృతంలలో పండితులు. కలగడ, మాంజి, చింతామణి రాగాలను కల్పించారు. మధుర మీనాక్షిదేవిని స్తుతిస్తూ ఆలపించిన తొమ్మిది కృతులు 'నవరత్న మాలిక'గా పేరొందింది. ప్రత్యేకించి ఆనంద భైరవి రాగంలో పలు కృతులను రచించారు. 1827 ఫిబ్రవరి 6న పరమపదించారు.

దామెర్ల రామారావు (వర్ధంతి)



దేశం గర్వించదగిన చిత్రకారులలో ఒకరైన దామెర్ల రామారావు 1897 మార్చి 8న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. గొల్లపడుచు, గోదావరి లోయ, పుష్పాలంకారం, ద్రోణుడు, సిద్ధార్థుని రాగోదయం వంటి చిత్రాలు దేశ విదేశాలలో పేరొందాయి. బరోడా మహారాజు, సంస్థానాధీశుల ప్రశంసలు పొందారు. బ్రిటీష్ ఎంపైర్ ఎగ్జిబిషన్‌లో ఏడాదిపాటు ప్రదర్శన సాగాయి. 1923లో ఒక చిత్రకళా పాఠశాలను స్థాపించి ఎంతోమంది యువకులకు శిక్షణ ఇచ్చారు. ఎంతో అద్భుత ప్రతిభ కల్గిన ఆయన 28ఏళ్లకే 1925 ఫిబ్రవరి 6న అకాలమరణం చెందడం విషాదకరం.

శివరాజు సుబ్బలక్ష్మి (వర్ధంతి)



శివరాజు సుబ్బలక్ష్మి 1925 సెప్టెంబరు 17న కోనసీమ జిల్లాలోని తాపేశ్వరంలో జన్మించారు. ప్రముఖ రచయిత్రి, చిత్రకారిణి. ఆమె రచనలకు, చిత్రలేఖనాలకు కవి, రచయిత అయిన ఆమె భర్త బుచ్చిబాబు (శివరావు వెంకట సుబ్బారావు) స్ఫూర్తినిచ్చారు. ఆమె కథలు అనేక సంకలనాలలో వెలువడ్డాయి. గృహలక్ష్మి, స్వర్ణ కంకణం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయంచే ప్రతిభా పురస్కారం అందుకున్నారు. 2021 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

లతా మంగేష్కర్ (వర్ధంతి)



'భారతరత్న' వంటి అత్యున్నత పురస్కారంతో దేశం మెచ్చిన నేపథ్యగాయని లతా మంగేష్కర్ 1929 సెప్టెంబరు 28న ఇండోర్‌లో జన్మించారు. అత్యధికంగా వెయ్యికి పైగా హిందీ సినిమాలకు పాటలు పాడారు. ఎనిమిది దశాబ్దాలలో స్వదేశీ, విదేశీ భాషలు కలిపి మొత్తం 36 భాషల్లో పాటలు పడిన ఘనత ఆమెది. నైటింగేల్ ఆఫ్ ఇండియా, దాదాసాహెబ్ ఫాల్కే, పద్మవిభూషణ్, 3 నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్, 15 బెంగాల్ ఫిల్మ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అవార్డులు లెక్కకు మిక్కిలి గౌరవాలు అందుకున్నారు. తండ్రి దీనానాథ్ జ్ఞాపకార్థం 800 పడకల ఆసుపత్రి నిర్మించారు. 2022 ఫిబ్రవరి 6న కన్నుమూశారు.

లారీ దగ్ధం

సైలెన్సర్‌లోకి ఉలవపొట్టు వెళ్లడమే కారణం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన లారీ

కుందుర్పి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నూర్పిడి కోసం వేసిన ఉలవ పంట లారీ దగ్ధానికి దారితీసింది. కుందుర్పి మండలం మలయనూరు వద్ద బుధవారం లారీలో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. కర్ణాటక రాష్ట్రం మంగళూరు నుంచి బాక్సైట్ మట్టితో లారీ తాడిపత్రి సిమెంట్ ఫ్యాక్టరీకి వెళుతోంది. మలయనూరు-వడ్డిపాలెం గ్రామాల మధ్య ఓ రైతు ఉలవ పంటను నూర్పిడి కోసం రోడ్డుపై వేశాడు. దానిపై వచ్చిన లారీ సైలెన్సర్‌లోకి ఉలవ పొట్టు వెళ్లి శబ్దం రావడంతో డ్రైవర్ దిగాడు. పొట్టును తొలగించేలోపు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ పాటికే లారీ పూర్తిగా కాలిపోయింది. ఎస్ఐ నాగేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామపంచాయతీల అప్‌గ్రేడేషన్‌లో లోపించిన శాస్త్రీయత

» జైభీమ్ జనజాగృతి వేదిక ఆరోపణ



మీడియా సమావేశంలో చిన్నప్ప చిక్కహగడె తదితరులు

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని 20 గ్రామపంచాయతీలను అప్‌గ్రేడ్ చేయడంలో ప్రభుత్వం శాస్త్రీయమైన విధానాలు పాటించలేదని కర్ణాటక జైభీమ్ జన జాగృతి వేదిక ఆరోపించింది. ఆనేకల్‌లో బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై చిన్నప్ప చిక్కహగడె మీడియాతో మాట్లాడారు. ఆనేకల్ నియోజకవర్గం పరిధిలోని దొమ్మసంద్ర, యమరె, సర్జాపుర (3 గ్రామపంచాయతీలు), అత్తిబెలె పురసభ పరిధిలోని నెరళూరు, బిదరగుప్పె (2), ఆనేకల్ పురసభ పరిధిలోని వణకనహళ్లి, సమందూరు (2) గ్రామపంచాయతీలు చేరి మూడు నగరసభలుగాను అలాగే కర్పూరు, బ్యాగడదేనహళ్లి గ్రామపంచాయతీ, ముగళూరు, నెరిగా గ్రామపంచాయతీ, బళ్ళూరు - మాయసంద్ర మరసూరు 3 గ్రామపంచాయతీలు), హందేనహళ్ళి, బిల్లాపుర, ముత్తానల్లూరు (3 గ్రామ పంచాయతీలు), ఇండ్లవాడి - హారగద్దె (2 గ్రామపంచాయతీలు) చేరి 5 పురసభలుగా విభజించాలని నిర్ణయించారన్నారు. ఈమేరకు బెంగళూరు నగర జిల్లా అధికారి, జిల్లా పంచాయతీ సీఈఓ, తాలూకా పంచాయతీ ఈఓలకు నివేదిక ఇచ్చినట్టు సమాచారం అందిందన్నారు. ఆనేకల్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీలైన చందాపుర, బొమ్మసంద్ర, అత్తిబెలెలను పురసభలుగా, హెబ్బగూడి గ్రామ పంచాయతీని నగరసభగా 2015లో పదోన్నతి చేశారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 20 గ్రామ పంచాయతీలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా 515 గ్రామపంచాయతీ స్థానాలు, 20 తాలూకా పంచాయతీ, 9 జడ్పీ స్థానాలు రద్దు అయ్యాయన్నారు. అంతేకాకుండా రిజర్వేషన్ల పరంగా గెలుపొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు సుమారు 60శాతం మందికి అన్యాయం జరిగిందన్నారు.

గ్రామపంచాయతీలకు అస్తిత్వం ఉండదు...

నియోజకవర్గంలోని 20 గ్రామ పంచాయతీలపైకి 9 గ్రామ పంచాయతీలు, 2 పురసభలను చేర్చి 3 నగరసభలుగాను, 11 గ్రామపంచాయతీలను చేర్చిం 5 పురసభలుగా విభజించడం ద్వారా గ్రామపంచాయతీలకు అస్తిత్వం ఉండదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ 74వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలలో జనాభా ఇతర ప్రమాణాల ఆధారంగా పట్టణ పంచాయతీని ఏర్పాటు చేసేందుకు 10-20వేల మంది జనాభా, పురసభకు 20వేల నుంచి 50వేల జనాభా, నగరసభకు 50వేల నుంచి 5లక్షల జనాభా ఉండాలన్నారు. అంతేకాకుండా ఒక చదరపు కిలోమీటరు ప్రదేశంలో కనీసం 1500మంది ప్రజలు నివసించాల్సి ఉందన్నారు. 50శాతం వ్యవసాయేతర కలాపాలు, 50శాతం ఉద్యోగులు ఉండాలన్నారు.

రాజకీయ మనుగడ కష్టం...

ప్రస్తుతం ఆనేకల్ నియోజకవర్గంలో 3 నగరసభలు, 5 పురసభల ఏర్పాటుకు 10-15 కిలోమీటర్ల పరిధి ఉందన్నారు. 2-3 గ్రామాలు చేరి పురసభ, నగరసభ వార్డును ఏర్పాటు చేయాల్సి ఉందని అయితే పాటించకపోవడంతో పాలన సజావుగా సాగదన్నారు. ఇదివరకు గ్రామపంచాయతీలలో జరిగే ఎన్నికలు పార్టీలతో సంబంధం లేకుండా సాగేవన్నారు. నగరసభ, పురసభ అస్థిత్వంలోకి వస్తే ఇది అమలు కాదన్నారు. పార్టీ గుర్తుల ద్వారా పోటీ చేయాల్సి వస్తే సామాన్యులు పోటీ చేయలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సహా మహిళలు దాదాపు 60శాతంమందికి అన్యాయం కానుందన్నారు. శ్రీమంతులు మినహా సామాన్యులు పోటీ చేయలేని పరిస్థితి తలెత్తుతుందన్నారు. తద్వారా రాజకీయ మనుగడ కష్టం కానుందన్నారు.

సిబ్బంది కొరత

గ్రామపంచాయతీలలో పీడీఓ, కార్యదర్శులు, స్థానికంగా నియమితులైన బిల్‌కలెక్టర్‌లు, వాటర్ మెన్‌లు, పౌరకార్మికులు ఇలా ఎంతోమంది ఉన్నారన్నారు. అదే పురసభ అయితే వందమంది, నగరసభ అయితే 200మందికిపైగా అధికారులు, సిబ్బంది అవసరమన్నారు. ఈ ప్రక్రియ వెంటనే అమలు కాక ఉన్న ఉద్యోగులపై ఒత్తిడి పెరిగి పాలన సజావుగా సాగదన్నారు. సిబ్బంది కొరతను అధిగమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగరసభ, పుర సభలుగా పదోన్నతి కల్పించేముందు ఆమేరకు పాటించాల్సిన విధానాలు, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అమలు చేయాల్సి ఉందన్నారు. ఏదేమైనా ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం సక్రమం గా లేదని అభిప్రాయపడ్డారు. మీడియా సమా వేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమా రాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అత్తిబెలె రవికుమార్, రాష్ట్ర కోశాధికారి చందాపుర మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పంట నూర్పిళ్లు వద్దు

» ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి



రైతుసంఘం సభ్యుల నిరసన

ముళబాగిలు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారులపై రాగికంకులు ఇతరత్రా నూర్పిడికోసం వేయడం ద్వారా తలెత్తే ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని రైతుసంఘం డిమాండ్ చేసింది. పట్టణంలోని ప్రజాపనులశాఖ ఇంజనీర్ కార్యాలయం వద్ద రాగి, ఇతర పంటల కంకులతో బుధవారం నిరసన తెలిపారు. కోట్లాదిరూపాయలతో అభివృద్ధి చేసిన రోడ్లపై పంటల నూర్పిడి చేపట్టడం ద్వారా జరిగే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాలలో కూలికార్మికుల కొరత కారణంగా యంత్రోపకరణాలకు డిమాండ్ పెరిగిందని అయితే వీటి ఖర్చు కూడా భారంగా ఉదన్నారు. వరి, రాగి, ఇతర పంటల నూర్పిడి రోడ్లపై చేపట్టడం సరికాదన్నారు. తద్వారా పంటలు కూడా దెబ్బతింటాయన్నారు. రోడ్లపై ఇలా చేపట్టేందుకు పీడీఓ ఇతర అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. నిరసనలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పారుక్‌పాషా, ఈకంబళ్ళి, మంజునాథ, రాజేశ్, భాస్కర్, సునిల్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రియా యోగా సిద్ధ విజ్ఞానం



సమావేశంలో పాల్గొన్న సభికులు

బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): క్రియా యోగా అనేది ఒక సిద్ధ విజ్ఞానం అని అన్ని కులమతాలకు అతీతంగా అభ్యాసం చేయవచ్చునని, మానవాళి వికాసంలో యోగా పాత్ర మహత్తరమైనదని యోగోదా సత్సంగ సొసైటీ అధ్యక్షులు, ఆధ్యాత్మిక ముఖ్యులు చిదానందగిరి అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్యాలెసమైదానంలో ఏర్పాటైన సమావేశంలో ఆయన ప్రసంగించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతగా ముందంజలో ఉన్నప్ప టికీ మన పూర్వీకులు అందించిన క్రియా యోగా అనే విధానం పాటించడం ద్వారా శారీరక, మానసిక స్థైర్యం కలిగిస్తుందన్నారు. ఇటీవలికాలంలో పలు కారణాలతో మనిషి జీవనశైలిపై ఒత్తిడి పెరిగిందని, దీన్ని అధిగమించేందుకు యోగాభ్యాసం చేయడం ఎంతో పరిష్కారం కాగలదన్నారు. పెద్ద సంఖ్యలో యోగాభ్యాసకులు, పరమహంస యోగానంద శిష్యులు తదితరులు పాల్గొన్నారు. ఎంతోమంది యోగాభ్యాసకులు ఉత్సాహంగా సమావేశంలో భాగస్వామ్యులయ్యారు.

నాసిరకం ఔషధాలతోనే బాలింతల మృతి

● డాక్టర్ గోపాల్ దబాడె



మాట్లాడుతున్న డాక్టర్ గోపాల్ దబాడె

రాయచూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరసగా చోటు చేసుకున్న బాలింతల మరణాలకు నాసిరకం ఔషధాల వినియోగమే కారణమని డ్రగ్ యాక్షన్ ఫోరం, ప్రజా ఆరోగ్య జాతా ఆందోళన ప్రముఖుడు డాక్టర్ గోపాల్ దబాడె అన్నారు. ఈ విషయంలో ప్రజలను ఆరోగ్యం పట్ల, ఔషధాల పట్ల చైతన్యం చేసేందుకు 3వ తేదీన బీదర్‌లో ప్రారంభించిన జాగృతి జాతా బెంగళూరు వరకు సాగుతుందన్నారు. జాతా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన నగరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫార్మా కంపెనీతో అధికారులు కుమ్మక్కు కావడం వల్లే నాసిరకం ఔషధాల సరఫరా జరిగిందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. నాసిరకం ఔషధాలు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైన తక్షణం స్పందించి నాసిరకం ఔషధాలు వినియోగించకుండా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలన్నారు.

పది విద్యార్థిని ప్రసవం

యువకుడిపై పోక్సో కేసు

ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థిని ప్రసవించడం పట్టణంలో కలకలం రేపింది. ఓ యువకుడు మాయమాటలు చెప్పి, బాలికను లోబరచుకున్నట్లు తెలిసింది. విద్యార్థిని బుధవారం ప్రసవించడంతో వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు...పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బాలిక ఈనెల 4న పాఠశాలలో ఉండగా కడుపు నొప్పి వచ్చింది. దీంతో హెచ్‌ఎం.. బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు వచ్చి కుమార్తెను ఇంటికి పిలుచుకెళ్లారు. బుధవారం కూడా కడుపు నొప్పి తగ్గకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి, బాలిక గర్భవతి అని తెలిపారు. అనంతరం బాలికకు వైద్యులు సాధారణ డెలివరీ చేయగా.. మగబిడ్డ జన్మించింది. బాలిక గర్భం దాల్చడానికి కారణం ఎవరని తల్లిదండ్రులు, పోలీసులు ఆరాతీయగా.. దుర్గానగర్‌కు చెందిన శ్రీనివాసులు కారణమని తెలిసింది. అతడు ప్రేమ పేరుతో బాలికను లోబరుచుకున్నట్లు బాలిక తెలిపింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

డబ్బులు ఇవ్వలేదని తల్లిపై దాడి

చికిత్స పొందుతూ మృతి



కృష్ణమ్మ(ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు అడిగిన డబ్బు ఇవ్వలేదని కన్నతల్లినే కడతేర్చాడు. ఈ సంఘటన మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అమర్‌దీప్ భార్య వదిలేయడంతో పనీపాట లేకుండా జులాయిగా తిరుగుతుండేవాడు. ఈక్రమంలోనే తన వ్యసనాలకు తల్లి అయిన బెల్లం కృష్ణమ్మ(68)ను ఈ నెల మూడో తేదీ డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో తీవ్ర ఆగ్రహంతో కట్టెతో తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు, బంధువులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఇందిర తెలిపారు. మృతురాలి కుమార్తె అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఆమె తెలిపారు.

ఆన్‌లైన్ మోసం

రూ.లక్షకు పైగా పోగొట్టుకున్న మహిళ

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాడి వలలో చిక్కిన ఓ మహిళ రూ.లక్షకు పైగా పోగొట్టుకున్న సంఘటన మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు...రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ ఇటీవల పుట్టినిల్లు అయిన ఓబుళంపల్లికి వచ్చింది. ఈనెల రెండో తేదీన ఆ మహిళ సెల్‌ఫోన్‌కు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. 'ఆరోగ్యశ్రీ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాను, మీనాన్నకు ఆరోగ్యశ్రీ కింద రెండేళ్ల కిందట శస్త్రచికిత్స జరిగింది. దానికి సంబంధించి రూ.40వేలు ప్రభుత్వం నుంచి బిల్లు పెండింగ్‌లో ఉంది. ఆ మొత్తాన్ని ఇప్పుడు మీ బ్యాంకు ఖాతాలోకి జమచేస్తాను. అందుకోసం మీ సెల్‌ఫోన్‌కు ఒక లింకు పంపిస్తున్నాను. ఓపెన్ చేసి లింక్‌పై క్లిక్ చేయండి' అని ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి చెప్పాడు. ఇదంతా నిజమేనని నమ్మిన ఆ మహిళ తనకు వచ్చిన లింకుపై క్లిక్ చేసింది. వెంటనే రూ.47,287 బ్యాంకు ఖాతా నుంచి కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. డబ్బు పోయిన విషయాన్ని ఆమె వెంటనే ఆ గుర్తు తెలియని వ్యక్తి దృష్టికి తీసుకెళ్లగా ఏదో సమస్య ఉన్నట్టు ఉంది. మరోసారి లింక పంపిస్తాను క్లిక్ చేస్తే పెండింగ్‌లో ఉన్న బిల్లు, ఇప్పుడు పోయిన మొత్తం అంతా కలిపి జమవుతుందని తెలిపాడు. దీంతో ఆమె మళ్లీ లింక్‌ను క్లిక్ చేసింది. రెండోసారి రూ.40వేలు కట్ అయినట్లు మళ్లీ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ మళ్లీ ప్రశ్నించగా ఇదొక సారి లింక పంపిస్తాను క్లిక్ చేయమని చెప్పడంతో ఆ మహిళ నమ్మి క్లిక్ చేసింది. దీంతో రూ.17500 నగదు మాయమైంది. మూడు విడతల్లో మొత్తం రూ.1.04లక్షలు పోగొట్టుకుంది. వెంటనే తనకు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి 1903 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి జరిగిన ఆన్‌లైన్ మోసం తెలిపింది. బాధితు రాలు మంగళవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ట్రోఫీతో బీఎంఆర్జి ఫైరీ ఫాల్కన్స్ జట్టు

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు

బెంగళూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని సదాశివనగర్ బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఫైనల్స్‌లో థండర్ డ్రాగన్స్ జట్టును బీఎం ఆర్జి ఫైరీ ఫాల్కన్స్ 3-1 స్కోరుతో ఓడించి ట్రోఫీని కైవశం చేసుకుంది. రెండు జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. కేప్టెన్ రితేశ్ సురేశ్ నేతృత్వంలో బిఎంఆర్జి ఫైరి ఫాల్కన్స్ జట్టు ప్రతిభ కనబరిచి చివరకు సదాశివనగర్ లీగ్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకుంది. వెంకటేశ్, ధారిణి, విజయ్, రితేశ్, నిర్మలా, తనుష్, శశికాంత్, హర్‌ప్రీత్, సతీశ్, అశోకొశెట్టి, రవిశంకర్‌లు ఫాల్కన్స్ జట్టునుంచి ప్రాతినిధ్యం వహించారు. సదాశివనగర్‌లోని క్లబ్‌లో రెండు విడతలుగా పోటీలు జరిగాయి. పోటీలకు కర్ణాటక స్టేట్ బిలియార్డ్స్ అసోసియేషన్ బ్యాడ్మింటన్ విభాగం సహకారం అందించింది. లీగ్‌లో ఆరు జట్లకు చెందిన 60కుపైగా బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అవసరం



సమావేశంలో వైద్యబృందం

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దేశంలో కేన్సర్‌ను నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అవసరమని అపోలో సంస్థ వైద్యాధికారులు అభిప్రాయపడ్డారు. బన్నేరుఘట్టరోడ్డులోని అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో కేన్సర్ నిర్ధారణ, నియంత్రణకు సంబంధించి ఐఎంఏ సహకారంతో వరల్డ్ కేన్సర్ డేలో భాగంగా 'యునిఫై టు నోటిఫై' అనే నినాదానికి శ్రీకారం చుట్టింది. అంకాలజీ ప్రాధ్యాపకులు, ప్రముఖ సలహాదారులు డాక్టర్ విజయ్ అగర్వాల్ 'యునిఫై టు నోటిఫై' ప్రాధాన్యతను వివరించారు. ప్రస్తుతం దేశంలో ఏటా 14లక్షలకుపైగా కొత్త కేన్సర్ కేసులు వెలుగు చూస్తున్నాయని 2025 చివరినాటికి 15.7లక్షలకు చేరే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ దీర్ఘకాలిక రోగంగా గుర్తించడం ద్వారా రియల్‌టైం డేటాతో ఖచ్చితమైన సమాచారం పొందుపరిచేందుకు సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఏహెచ్‌ఐఎల్ కర్ణాటక కేంద్ర విభాగం సీఈఓ డాక్టర్ మనీశ్‌మట్టూ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మేలూరు సహకార సంఘం జేడీఎస్ వశం



సంఘం నూతన సభ్యులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మేలూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో 25వ సంవత్సరం కూడా జేడీఎస్ మద్దతుదారులైన 12మంది (వీరిలో ఏడుగురు ఏకగ్రీవం) ఎన్నిక కావడం ద్వారా అధికారాన్ని దక్కించుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఒకరు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా టైలర్ నాగరాజ్ ఉపాధ్యక్షులుగా కెంపేగౌడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఆర్ఏ ఉమేశ్, ఎంజే ప్రభాకర్, బీఎం శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్ మంజునాథ్, గోపాల్‌రెడ్డి, ఏబీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. నూతన పదాధికారులను ఆత్మీయంగా సత్కరించారు.

అక్రమ మద్యం, గంజాయి స్వాధీనం



దాడుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది


చింతామణి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని రెండో వార్డు ఆశ్రయ లే అవుట్‌లోని రత్నమ్మ అనే మహిళ ఉంటున్న ఇంట్లో అక్రమమద్యం, గంజాయి విక్రయిస్తున్నారనే ఫిర్యాదు మేరకు అబ్కారీ అధికారులు మంగళవారం రాత్రి అకస్మిక తనిఖీలు చేశారు. 9 హేవార్డ్స్ చేయిన్స్ విస్కీ టెట్రాప్యాకెట్‌లు, 38 గ్రాముల ఎండిన గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అబ్కారీ డీఎస్పీ జీఎస్ పాటిల్, ఇన్‌స్పెక్టర్ మంజుళా, సబ్ ఇన్‌స్పెక్టర్ దేవరాజ్ సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



లింగసుగూరు తాలూకా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న డీసీ నితీశ్

రాయచూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లాధికారి నితీశ్ ఆదేశించారు. బుధవారం జిల్లాలోని లింగసుగూరు తాలూకా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ప్రతి వార్డును ఆయన పరిశీలించారు. ఫార్మసీ స్టోర్ రూంను అక్కడ అందుబాటులో ఉన్న ఔషధాలను పరిశీలించారు. అనంతరం వార్డుల్లోని రోగులతో వైత్యసేవల గురించి కలెక్టర్ వారిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలు, అందుబాటులో ఉన్న ఔషధాలు, డైలసిస్ సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాధికారి వెంట డీహెచ్ఓ డాక్టర్ సేరేంద్ర బాబు ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రారంభించాలి



కార్పొరేషన్ ఇంజనీర్‌ను ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని దుర్గమ్మ ఆలయం సమీపంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలని బీజేపీ నాయకుడు ఎం.సతీష్ డిమాండ్ చేశారు. చాలా వరకు పనులు పూర్తయినా ఎందుకు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. రైల్వే శాఖ పనులు పెండింగ్‌లో ఉన్నాయని బ్యానర్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. నిజపై రైల్వే శాఖ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మా నుంచి ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసిందన్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన మున్సిపల్ కమిషనర్‌ను బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు అండర్ బ్రిడ్జిని ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఆయన స్పందిస్తూ ఈ రోడ్డు మున్సిపాలిటీకి సంబంధం లేదని, రాష్ట్ర రహదారికి సంబంధించిందని స్పష్టం చేశారు. దీనిపై నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బ్రిడ్జిని ఎవరూ ప్రారంభిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొందని నాయకులు అన్నారు.

అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం



అండర్ బ్రిడ్జికి తుదిమెరుగులు దిద్దుతున్న కార్మికులు

బళ్లారిరూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలో దుర్గమ్మ గుడి అండర్ బ్రిడ్జి 9వ తేదీ ప్రారంభం సందర్భంగా పనులు వేగవంతం చేశారు. 9వ తేదీన ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి తెలిపారు.

మరో బాలింత మృతి



గౌసియా(ఫైల్)

బళ్లారి సిటీ/రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లా ఆసుపత్రుల్లో గర్భిణుల మరణాల పరంపర కొనసాగుతోంది. సిరుగుప్ప తాలూకా తెక్కలకోట పట్టణానికి చెందిన ఒక మహిళ మంగళవారం సాయంత్రం బళ్లారి మెడికల్ కాలేజ్ అండ్ సైన్స్ సెంటర్(బిమ్స్)లో ప్రసవానంతరం మృతిచెందింది. జనవరి 4న రేష్మా గౌసియా(20) అనే మహిళ సిజేరియన్ ద్వారా బిడ్డకు జన్మనిచ్చింది. నాలుగు రోజుల తర్వాత ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అనంతరం రేష్మకు శ్వాస తీసుకోవడంలో సమస్యలు వచ్చాయి. జనవరి 14న మళ్లీ ఆసుపత్రిలో చేరగా కృత్రిమ శ్వాస అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతిచెందింది. బిమ్స్ డైరెక్టర్ గంగాధర్‌గౌడ మాట్లాడుతూ రేష్మకు ఊపిరితిత్తుల సమస్య ఉందని అన్నారు. దీనికి సిజేరియన్ ఆపరేషన్‌తో సంబంధం లేదన్నారు. మేము అన్ని రకాల చికిత్సలు అందించామన్నారు. అయితే రేష్మ మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ తీగ తగిలి యువకుడు..



హొసమని(ఫైల్)

గంగావతి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళకు వెళ్లి తిరిగి అయోధ్యకు వెళుతున్న సమయంలో కారటిగి తాలూకా సిద్దాపుర గ్రామానికి చెందిన హొసమని(27) అనే యువకుడు మృతి చెందాడు. గోరఖ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో విద్యుత్ తీగ తగలి హొసమని మృతి చెందినట్లు స్థానిక రైల్వే అధికారులు జిల్లా పోలీసు శాఖకు సమాచారం ఇచ్చారు. ప్రవీణ్ 15 రోజుల క్రితం ప్రయాగరాజ్‌కు వెళ్లాడు. అతని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి పోలీసులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

విమానాశ్రయ నిర్మాణం కలేనా..?

- 15 ఏళ్లు గడిచినా ముందుకు సాగని పనులు
- మాగాణి భూముల్లో వద్దంటున్న రైతులు
- 900 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణానికి అనుమతులు
- సిరువార-చాగనూరు వద్ద వీలుపడదు: ఏటీసీ



ఆగిపోయిన విమానాశ్రయ పనులు

బళ్లారి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బళ్లారిలో విమానాశ్రయ నిర్మాణం కలగానే మిగులుతోంది. పెరుగుతున్న మానవుడి ఆలోచనలు, అవసరాలకు అనుగుణంగా బళ్లారిలో విమానాశ్రయం ఏర్పాటుకు అప్పటి రాష్ట్ర సర్కార్ ఓకే చేసింది. ప్రభుత్వాలు మారుతుండడం, కాంట్రాక్టర్ల మధ్య లాభనష్టాలు పేచీలు, కమీషన్ల వ్యవహారం భూ కొనుగోళ్ల వివాదం వెరసి ఇప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు.

● 2009లో బళ్లారి జిల్లా సిరువార-చాగనూరు గ్రామాల మధ్య విమానాశ్రయం నిర్మాణానికి అప్పటి బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 900 ఎకరాల విస్తీర్ణంలో ఇక్కడ విమానాశ్రయం నిర్మించాలని ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు రైతుల నుంచి 900 ఎకరాల్లో 700 ఎకరాల వరకు భూమిని సేకరించింది. అప్పటి మార్కెట్ రేటును బట్టి భూములను ప్రభుత్వం కొనుగోలు చేసింది.

● 2011లో పనులకు టెండర్ పిలిచారు. ఇందుకు సిరువార-చాగనూరు రైతు పోరాట సమితి విమానాశ్రయ నిర్మాణానికి వ్యతిరేకించింది. తుంగభద్ర జలాలతో నిత్యం ప్రవహించే ఎగువ కాలువ, అలాగే వేదవతి నది, ఇతర నీటి వనరులు కలిగిన ఈ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు మంచిది కాదని, మూడు పంటలు పండే ఈ భూమిలో విమానాశ్రయం వద్దని నినదించింది. అప్పట్లో రైతు పోరాట నాయకులుగా ఎం. మాధవరెడ్డి, న్యాయవాది మల్లికార్జున రెడ్డి నేతృత్వంలో పోరాటాలు సాగాయి.

● కర్ణాటక రాష్ట్ర పరిశ్రమల శాఖ ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటుపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. బళ్లారి జిల్లా సిరువార-చాగనూరు మధ్యలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తూ గడిభాగంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం, కర్నూలు, అలాగే ఇప్పుడు తెలంగాణలో ఉండే కొన్ని జిల్లాల ప్రయాణికులకు ఈ విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందనేది ప్రభుత్వ ఉద్దేశం.

● గతంలో ఏరియల్ ట్రాఫిక్ సర్వే(ఏటీసీ) కూడా విమానాశ్రయం ఏర్పాటుకు ఈ ప్రాంతలో కొంత అనుకూలం అని నివేదిక ఇచ్చింది. అప్పుడు ఉమ్మడి జిల్లా అయిన బళ్లారి-విజయనగర మధ్యలో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యం కాదని ఏటీసీ సర్వేలో తేల్చింది. ప్రస్తుతం జిందాల్ లాంటి ఎయిర్ పోర్టుకు కూడా విమానాలు దిగేందుకు వీలు పడదు అని ఏటీసీ పేర్కొంది.

● అనేక చిక్కులు, సమస్యలు మధ్య బళ్లారిలో విమానాశ్రయం ఏర్పాటు ఇప్పట్లో కుదరదని నిపుణులు పేర్కొంటున్నారు. ఒకవేళ బళ్లారి నుంచి ఇతర ప్రాంతాలకు విమానాశ్రయ నిర్మాణం మారిస్తే ఇంత వరకు ఇక్కడ పెట్టిన పెట్టుబడి సంగతి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

సిరులు పండే భూముల్లో విమానాశ్రయం వద్దు



బళ్లారి జిల్లా సిరువార- చాగనూరువద్ద విమానాశ్రయం ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. విమానాశ్రయ నిర్మాణంతో సిరులు పండే భూమిని రైతులు కోల్పోవల్సి వస్తుంది. తుంగభద్ర ఎగువ, దిగువ కాలువ, వేదావతి నది మూడు వైపులా ఈ భూములకు నీరు అందిస్తున్నాయి. ఇలాంటి భూముల్లో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ఆహార కొరత ఏర్పడుతుంది. - ఎం. మాధవరెడ్డి, కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం

రైతులకు తీరని నష్టం



ఇక్కడ భూములు చాలా సారవంతమైనవి. ఈ భూములకు మూడు వైపులా నీరు అందుబాటులో ఉన్నాయి. ఇంత ప్రాముఖ్యత ఉన్న భూముల్లో విమానాశ్రయం పేరుతో రైతుల నుంచి భూములు లాక్కున్నారు. బళ్లారి జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలి. అయితే ఇక్కడ వద్దు. వర్షాధార భూముల్లో అయితే అందరికీ మంచిది. - మల్లికార్జునరెడ్డి, భూపోరాట సమితి

గిరిజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా, అశోక చెలవాడి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో మార్చి మొదటి వారంలో రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. గిరిజన ఉత్సవం నిర్వహణకు సంబంధించి బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ హాల్లో ఏర్పాటు చేసిన ప్రాథమిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి పరిషజాతి కింద బళ్లారిలో రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తొలిసారిగా నిర్వహిస్తున్న ఒకరోజు గిరిజన ఉత్సవం వేదిక తేదీని ఇన్‌చార్జి మంత్రితో చర్చించి ఖరారు చేస్తామన్నారు. గిరిజన సంఘం నాయకుల నుంచి అవసరమైన అన్ని సలహాలు, మార్గదర్శకాలను తీసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రస్థాయి కార్యక్రమం కావున వివిధ ప్రాంతాల నుంచి 600 మందికిపైగా కళాకారులు పాల్గొనే అవకాశం ఉందన్నారన్నారు. వారికి వసతి, రవాణా ఏర్పాట్లు చేయడానికి జిల్లా స్థాయి శాఖల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ షెడ్యూల్ కులాల హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. గిరిజన సమాజంపై కవిత్వం, వ్యాసం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేయాలని ఆయన అన్నారు. కన్నడ సంస్కృతిశాఖ బెంగళూరు జోన్ జాయింట్ డైరెక్టర్ అశోక చెలవాడి మాట్లాడుతూ షెడ్యూల్ తెగల గిరిజన వర్గాల కళాకారులు తమ సాహిత్యం, కళలను ప్రదర్శించడానికి ఒక వేదికను అందించడం గిరిజన ఉత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. సమాజంలోని కవులు, జానపద కళాకారులు, నృత్యకారులు, సంగీతకారులు, సినిమా కళాకారులు, శిల్పులు ఉన్నారని, వారికి కూడా అవకాశాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో చిత్రీకరించే ప్రజాదరణ పొందిన కార్యక్రమం అయి ఉండాలన్నారు. గిరిజన సమాజం దుస్తులు, ఆభరణాలను ప్రదర్శించడానికి ఒక ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ కలబురగి జోన్ జాయింట్ డైరెక్టర్ బసవరాజ్ హుగారా, బళ్లారి అసిస్టెంట్ డైరెక్టర్ బి. నాగరాజు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి దివాకర్, స్త్రీ శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, వివిధశాఖల అధికారులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న పురసభ అధ్యక్షుడు బట్ట ప్రసాద్

కంప్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పురసభ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధ్యక్షుడు బట్ట ప్రసాద్ హెచ్చరించారు. కంప్లిలో బుధవారం పురసభ ప్రాంగణంలో బడ్జెట్ పూర్వభావి సమావేశం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ గోశాల ఎదురు మసీదు నుంచి జోగి కాలువ వరకు రోడ్డు విస్తరణ పనులు, మారెమ్మ ఆలయం నుంచి సన్నాపురం రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. ప్రతి వార్డులో వీధిలైట్లు, పట్టణాన్ని పరిశుభ్రం చేయాలని రాజ్ కుమార్ ప్రధాన వీధిలో శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. అంబేడ్కర్ సర్కిల్లో విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఫారం త్రీ మ్యుటేషన్ పట్టణ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఉపాధ్యక్షురాలు సుశీలమ్మ ముఖ్య అధికారి దుర్గన్న, దానప్ప, రామన్న, మనోహర్, సిద్దప్ప, జాఫర్, హేమయ్య స్వామి, చిత్ర వీరాంజనేయులు, సీఆర్ హనుమంతు, ఉస్మాన్, దేవేంద్ర, జిలాన్ మౌనేష్, గోపాలప్ప, కోట్రేష్ పాల్గొన్నారు.

వైరస్ సోకిన మాంసం విక్రేతలపై చర్యలు తీసుకోండి

కంప్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాంసం మార్కెట్లలో వైరస్ సోకిన మాంసం అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలని పశువైద్యాధికారి బసవరాజుకు పలు సంస్థలు వినతిపత్రం అందించాయి. దాసప్ప రామన్న, సి హనుమంతు మాట్లాడుతూ మాంసం మార్కెట్లో వైరస్ సోకిన జీవాలను తక్కువకు కొనుగోలు మాంసం అమ్మకాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పొలాల్లో గొర్రెలు, మేకల మందల్లో చనిపోయినవి తీసుకొచ్చి విక్రయిస్తున్నారన్నారు. అలాంటి మాంసం కొనుగోలు చేసి తినడం వల్ల ప్రజలు రోగాల బారినపడే అవకాశం వుందన్నారు. వెంటనే ఇలాంటి వాటికి చోటు కలిగించకుండా, అలాంటివి విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మస్తాన్, వెంకటేష్, దేవేంద్ర, జాఫర్, శివప్ప పాల్గొన్నారు.



పశువైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ఏఐకేకేఎంఎస్ నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై ఏఐకేకేఎంఎస్ నిరసన

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం ఏఐకేకేఎంఎస్ రైతు సంస్థ తాలూకా కార్యలయం ఎదుట కేంద్ర ప్రభుత్వం ఇటీవల సమర్పించిన 2025-26 బడ్జెట్ ప్రతిని దహనం చేయడం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ ఈసారి బడ్జెట్‌లో నరేగా పథకానికి రూ.4 వేల కోట్లు, వ్యవసాయానికి నాలుగు లక్షల కోట్లకుపైగా కోత విధించిందన్నారు. దీన్ని బట్టి చూస్తే కార్పొరేట్ సంస్థల కోసమే బడ్జెట్‌ను రూపొందించినట్లు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి గురల్లి రాజా అధ్యక్షత వహించి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేశామని అంటుందే తప్ప వాస్తవానికి వారిని కష్టాల్లోకి నెట్టేవేసినట్లు స్పష్టమవుతోందన్నారు. అధికారంలోకి వచ్చే ఏ ప్రభుత్వమైనా ఈ వ్యవస్థలో పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన పోరాటం చేయాలని అన్నారు. బళ్లారి తాలూకా కార్యదర్శి ధనరాజా, రైతులు హనుమంత, నింగన్న పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల బియ్యం పంపిణీ



బియ్యం తరలించే లారీ వద్ద వాల్మీకి సమాజం నాయకులు

కంప్లి, ఫిబ్రవరి 5(ఆంధ్ర జ్యోతి): వాల్మీకి పీఠం రాజనహళ్లిలో జరిగే 8,9 తేదీల్లో వాల్మీకి జాతరకు కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గణేష్ 40 క్వింటాళ్ల బియ్యం అందించారు. తాలుకాలోని గ్రామాల్లో జాతర కోసం బియ్యం, మిరపకాయలు, ఇతర ఆహార సామగ్రిని వాల్మీకి సర్కిల్ నుంచి లారీలో రాజనహళ్లికు పంపించారు. కంప్లి తాలుకా వాల్మీకి సంఘం అధ్యక్షుడు నారాయణప్ప మాట్లాడుతూ జాతరను విజయవంతం చేద్దామన్నారు. కంప్లి తాలుకా నుంచి ప్రతి గ్రామంలో భారీగా తరలిరావాలని కోరారు. వెంకటేష్ బర్మక్క, రామాంజిని, నీరుగంటి వీరేష్, లక్ష్మన్న, మరిలింగప్ప, మంజన్న, వీరేష్, రాఘవేంద్ర, వెంకటేష్, ఈరన్న, శేఖర్, ఆది నాగరాజు పాల్గొన్నారు.

సాహిత్య సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, పదాధికారులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని విజయవంతం చేస్తామని సిరుగుప్ప తాలుకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్ కారిగనూరు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఎన్జీవో భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15వ తేదీ నుంచి 7వ కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భాష, సంస్కృతి, సాహిత్యం, కళలు తదితర అంశాలను వివరించేందుకే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సమ్మేళనానికి అధ్యక్షుడిగా శివకుమార్ బళిగనూరును ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. తాలుకా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎయిమ్స్ సాధనకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

- పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్ కళస



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ కుమార్ నాయక్

రాయచూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ కోసం కేంద్రంపై మరింత ఒత్తిడి పెరగాలని ఎమియ్స్ పోరాటసమితి కన్వీనర్ బసవరాజ్ కళ అన్నారు. జిల్లాకు ఎయిమ్స్‌ను రప్పించేందుకు జరుగుతున్న పోరాటం మరింత తీవ్రరూపం దిల్చింది. 999 రోజులుగా చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం వెయ్యో రోజుకు చేరింది. జిల్లా కేంద్రం రాయచూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని కర్ణాటక భవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అన్ని ప్రాధాన రహదారులను చుడుతూ నిరవధిక దీక్ష వేదిక మహాత్మగాంధి స్టేడియం వద్దకు చేరింది. ర్యాలీలో రాయచూరు ఎంపీ కుమార్ నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు రవి భోసరాజు పాల్గొన్నారు. నిరసనకారులు కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్వీనర్ మాట్లాడుతూ వెయ్యి రోజులుగా పోరాటాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పోరాటానికి స్పందించిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇప్పటికే రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోరుతూ ఐదు సార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినా, తీర్మానం అందజేసినా స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. ఈ విషయంలో బీజేపీ పెద్దలు కేంద్రంపై ఒత్తిడి తేవడం ద్వారా ఇచ్చిన మాటను నిలుపుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్రధ్యక్షుడు బీవై విజయేంద్ర ఇటీవల ఎయిమ్స్ పోరాట శిబిరాన్ని సందర్శించి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండి కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యంగా ప్రధాన మంత్రిపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రం పై కేంద్రానికి సవతి తల్లి ప్రేమ..! ఎంపీ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వానికి సవతి తల్లి ఉందన్నారు. ఎయిమ్స్ ఏర్పాటు కోరుతూ మూడేళ్లుగా పోరాటం సాగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మంజూరుపై స్పష్టతనివ్వకపోవడం ఈ ప్రాంతం పట్ల బీజేపీ పాలకులకున్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

ఘనంగా సవిత మహర్షి జయంతి

సిరుగుప్ప, ఫిబ్రవరి 5(ఆంధ్ర జ్యోతి): సవిత మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సవిత మహర్షి భావ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన తత్వ సిద్ధాంతాలను పాటించాలని సూచించారు. సవిత మహర్షి అడుగుజాడల్లో నడవాలని ఆయన కోరారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సవిత సమాజ సభ్యులు పాల్గొన్నారు.



సవిత మహర్షి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

హోసూరు జోన్

సకాలంలో వేతనాలు చెల్లించాలి

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సకాలంలో వేతనాలు ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో గ్రామసహాయకులు ధర్నా చేపట్టారు. హోసూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు నిరసన కొనసాగింది. గ్రామ సహాయకులను ప్రభుత్వ ఉద్యోగుల డి కేటగిరీలో చేర్చాలని, గ్రామ సహాయకులకు గత 30 ఏళ్లుగా నిర్ణీత కాలానుగుణ వేతనాలు చెల్లించాలని కోరుతున్నా నేటికీ అమలు కావడం లేదన్నారు. గ్రామ సహాయకులు చనిపోతే ఆ కుటుంబం బతకలేని పరిస్థితి నెలకుంటోందన్నారు. 1999లో అప్పటి సీఎం కరుణానిధి కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగం ఇచ్చారన్నారు. 23 ఏళ్లుగా లబ్దిపొందిన వారసత్వ పనులను తిరిగి ఇచ్చేలా ప్రభుత్వ ఉత్తర్వును రద్దు చేయాలని కోరారు. 2007 తర్వాత సీపీఎస్ ఈ పథకంలో పదవీ విరమణ పొంది మరణించిన గ్రామ సహాయకులకు ప్రభుత్వం విధించిన డబ్బును ఇంతవరకు అందించలేదని, గ్రామ సహాయకులకు తాత్కాలిక సిపీఎస్ నంబర్ ఇచ్చి వేతనాలు చెల్లిస్తున్నారని, పర్మినెంట్‌గా సీపీఎస్ నెంబర్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్కిల్ లీడర్ ఆర్ముగం నేతృత్వంలో బైఠాయించి నిరసన తెలిపారు. రవికుమార్ స్వాగతోపన్యాసం చేయగా, బసవరాజు అధ్యక్షత వహించారు. సుఖేంద్రన్ ప్రసంగించారు. నిరసనలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుగుణమ్మ, భాస్కర్, ఆర్ముగంతో పాటు గ్రామ సహాయకులందరూ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామ సహాయకులు

ప్రభుత్వ వైద్య కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్



వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాలను జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ బుధవారం స్వయంగా పరిశీలించారు. ఆసుపత్రి మొదటి అంతస్తులోని అవుట్ పేషెంట్ విజిట్ చేసిన రికార్డును పరిశీలించారు. చికిత్సలో పురుషులు, స్త్రీలు, మరియు వికలాంగుల, రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఆసుపత్రి మరుగుదొడ్లు, డీకంప్రెషన్ విభాగం, అలాగే పురుషులు, స్త్రీలు, దివ్యాంగుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వివరాలు, మెడిసిన్ విభాగం వివరాలు, జనరల్ చికిత్స డిపార్ట్‌మెంట్, సర్జరీ డిపార్ట్‌మెంట్, రక్తశుద్ధి యూనిట్, ఎలక్ట్రికల్ సర్వీస్ యూనిట్, ఆరో అంతస్తులోని అనస్తీషియా యూనిట్, ఇంటెన్సివ్ సర్జరీ తర్వాత అనస్తీషియా కేర్ యూనిట్లు, గ్రౌండ్ ఫ్లోర్ లాండ్రీ, ఆక్సిజన్ స్టోరేజ్ సెంటర్, వంటగది, పోస్ట్‌మార్టం గదిని పరిశీలించారు. రోగులకు అందజేస్తున్న ఆహారం, కూరగాయల రకాలను అడిగి తెలుసుకున్నారు, పేషెంట్లకు అందజేసే ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్పిటల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాత్విక, రెసిడెంట్ అసిస్టెంట్ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, వైద్య అధికారులు రాజా, దినేశ్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి శరవణన్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శక్తివేల్, జిల్లా కమిషనర్ వళర్మతి పాల్గొన్నారు.

కైలాసనాథుడికి విశేష పూజలు

హోసూరు(కృష్ణగిరి) ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రథసప్తమిని పురస్కరించుకుని బేరికైలో వెలసిన పార్వతీ సమేత కైలాశనాథేశ్వర ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. సూర్యభగవానునికి దీపారాధన చేసి విశేషపూజలు చేశారు. భక్తులు జిల్లేడు ఆకులతో స్నానాలు ఆచరించి సాంప్రదాయ ప్రకారం పూజలు చేశారు. సకల జగత్తుకి వెలుగునిచ్చే సూర్యుడు తన దిశను ఉత్తరానికి మార్చుకునే రోజునే రథసప్తమిగా పరిగణిస్తారు. ఆనవాయితీ ప్రకారం సూర్యునికి అర్ఘ్యం కూడా సమర్పిస్తారు. మాఘమాసంలో వచ్చే రథసప్తమి రోజు వారి పరమేశ్వరుడికి విశేషపూజలు, అలంకరణలు చేశారు. హిమగిరి లేఅవుట్ శివకుమార్ కుటుంబీకులు సేవా కార్యక్రమం నిర్వహించారు.



అలంకరణలో స్వామివారు